కథ

హోరున వాన కురుస్తోంది..
''ట్రాఫిక్ మరీ పెరిగిపోయింది.. అర కిలోమీటరుకు అరగంట పడుతోంది'' – గట్టిగా అన్నాడు విశాల్.
పరధ్యానంగా కిటికీలో నుంచి ట్రాఫిక్ చూస్తున్న మానస ఉలిక్కిపడింది.
''ఏంటి ఆలోచిస్తున్నావు''– అడిగాడు విశాల్.
''పంజాగుట్ట శ్మశానం''– అంది మానస. ''శ్మశానం'' రెట్టించాడు విశాల్.
''శ్మశానాన్ని తవ్వేస్తున్నారు...'' నిద్రలోంచి హఠాత్తుగా లేచిన దానిలా గట్టిగా అంది మానస.

# ఆవాహన

## సి.వి.ఎల్.ఎన్. ప్రసాద్



''ఇందాకటి నుంచి చూస్తున్నా.. శ్మశానమంటావు.. తవ్వేస్తున్నారంటావు.. ఏమైంది నీకు'' అన్నాడు విశాల్.

''రోడ్డు మీద వెళ్తున్నప్పుడు కాస్తంత పక్కకు కూడా చూడాలి.. గుడ్డి గుర్రంలా వెళ్లిపోతే ఎలా..'' ఎద్దేవా చేసింది మానస.

''వాదన సరే.. ఏమైందో చెప్పు..'' అన్నాడు విశాల్ కొంచెం చిరాకుగా..

''రోడ్డును వెడల్పు చేయటానికి శ్మశానాన్ని తవ్వేస్తున్నారు. అప్పుడు దయ్యాలు బయటకు వస్తే'' అంది మానస కొద్దిగా భయంగా.

''అంత చదువు చదివావు.. పట్టణంలో పుట్టానంటావు.. నువ్వు కూడా దయ్యాలంటున్నావు.. రాత్రి టీవీల్లో వచ్చే దయ్యాల సీరియల్స్ చూడటం మానేయ్'' అన్నాడు విశాల్.

''నిజంగానే అడుగుతున్నా. రోడ్డును వెడల్పు చేయటానికి తవ్వుతారుగా.. అప్పుడు కొన్ని సమాధులు బయటపడతాయి కదా. సమాధులను పగలకొడితే వాటి నుంచి క్షుద్ర శక్తులు బయటకు వస్తాయంటారు..'' అది ఏదో చెబుతోంది.. పక్కనో కారు హారన్ గట్టిగా మోగింది.

''నిమిషం ఆగరు.. అలాగని ట్రాఫిక్ సెన్స్ ఉండదు'' అంటూ తిట్టుకుంటూ కారును ముందుకు ఉరికించాడు విశాల్..

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది.. మానస ఇంకా

పరధ్యానంగా కిటికీలోనుంచి చూస్తూనే ఉంది.

***

విశాల్, మానసలకు పెళ్లి అయి ఆరు నెలలు అయింది. ఇద్దరూ హైటెక్ సిటీలో ఒక మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్నారు. జీతాలు బాగా వస్తాయి. పెళ్లి అయిన మూడు నెలలకే కావాల్సినవన్నీ కొనుక్కున్నారు. చిన్న చిన్న గొడవలు ఉన్నా మొత్తం మీద సంసారం బానే సాగిపోతోంది. విశాల్‌కు ఓపిక ఎక్కువ. పగలు, రాత్రి చేయాల్సిన ఉద్యోగం అతని ఓపికని మరింత పెంచింది. మానసకి చిరుకోపం. చిన్న చిన్న విషయాలను ఎక్కువగా పట్టించుకుంటుంది. ఆఫీసులో కూడా అదే పరిస్థితి. దాదాపు ప్రతి రోజు ఆఫీసు నుంచి వచ్చే సమయానికి మానస మూడ్ ఆఫ్ అయిపోయే ఉంటుంది. విశాల్ ఎప్పటికప్పుడు సర్దిచెబుతుంటాడు. ఆ రోజు కూడా మానస మూడ్ బాగాలేదు. ''వెధవలకు ఏం రాదు.. ఎర్ర బస్సు ఎక్కేసి వచ్చేస్తారు..'' అని తిట్టుకుంటూ సాయంత్రం కారెక్కింది. ''ఏమైంది?'' అడిగాడు విశాల్.

''కాల్‌లో పొద్దున్నంతా గొడవే.. ఆన్‌సైట్‌లో ఏదో అడుగుతారు.. వీళ్లకి ఏం చెప్పాలో తెలియదు. దీనితో అనేక ఇబ్బందులు'' అంది మానస.

''కొత్తేముంది.. సరే.. కూరలు కొనాలా.. ఉన్నాయా?'' అని టాపిక్ మార్చాడు విశాల్. ఇంటికి వచ్చేసరికి వాన మరింత పెరిగింది. విశాల్ వాళ్ల ఇల్లు మొదటి ఫ్లోర్‌లో ఉంటుంది. వంటింటి కిటికీకి ఆనుకొని పెద్ద వేప చెట్టు ఉంటుంది. వేసవి కాలంలో చల్లటి గాలి వేస్తుంది. శీతకాలం, వానాకాలం- ఆ చెట్టు వల్ల దోమలు పెరిగిపోతాయంటాడు విశాల్. వేప చెట్టు వల్ల ఎటువంటి క్రిములు రావంటుంది మానస.


***

రాత్రి వానతో పాటుగా గాలి కూడా పెరిగిపోయింది. కిటికీ తలుపులు కొట్టుకుంటున్నాయి. ''కాల్‌లో ఉన్నా, వెళ్లి తలుపులేసి వస్తావా?.. అడిగాడు విశాల్. ''సరే.. అని వంటింటిలోకి వెళ్లింది మానస.

టీవీ మోగుతూనే ఉంది. ''కాల్ అయిపోయింది.. అన్నం తిందామా'' అడిగాడు విశాల్. సమాధానం లేదు. ''కాల్ అయిపోయింది.. అన్నం తిందామా..'' ఈసారి గట్టిగా అడిగాడు . సమాధానం లేదు. బాత్‌రూమ్‌కి వెళ్లిందేమో అనుకున్నాడు విశాల్. టీవీ మోగుతూనే ఉంది. ''వెళ్లేటప్పుడు సౌండ్ తగ్గించదు'' చిన్నగా తిట్టుకున్నాడు.

''మను..'' గట్టిగా పిలిచాడు విశాల్. సమా. దానం లేదు.

''మను..'' అని పిలుస్తూ



వంటింట్లోకి వెళ్లాడు. కురుస్తున్న వాన హఠాత్తుగా ఆగిపోయింది. అంతా నిశ్శబ్దం. కిటికీ చూరు నుంచి నీరు కారుతున్న చప్పుడు. ''మను..'' అని మరో సారి పిలవబోయి.. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయాడు. వంటిట్లో లైటు వెలగటం లేదు. మానస జుట్టు విరబోసుకొని కిటికిలోనుంచి చెట్టును చూస్తోంది. రోడ్డు మీద లైటు కాంతి చెట్టు మీద పడుతోంది. ఆ కాంతి కొద్దిగా వంటింట్లోకి చొచ్చుకు వస్తోంది. విశాల్‌కు కాలిలో నుంచి భయం సర్రున పాకింది. అడుగు ముందుకు వేద్దామనుకొని ఆగిపోయాడు. కిటికీ చూరు నుంచి నీరు కారుతున్న చప్పుడు. మొత్తం దృశ్యమంతా భయానకంగా ఉంది. ''మానస.. ఏమైంది నీకు..'' గట్టిగా అరిచాడు. కరెంటు పోవటంతో విశాల్ కేక మరింత పెద్దగా వినిపించింది. కిటికీ చూరు నుంచి నీరు కారుతూనే ఉంది.

***

''అబ్బబ్బ..ఎందుకలా మేకలా అరుస్తారు.. ఇందాకటి నుంచి చూస్తున్నా.. సీనరీ బావుంది కదా అని కిటీకిలో నుంచి చూస్తున్నా.. ఇంతలో నీ అరుపులు'' అని విసుక్కుంది మానస. ''వంటింట్లో ట్యూబు పోయింది. వెలుతురు రావటం లేదు.. వేసిన కిటికీ తీసా. సీనరి బావుంటే చూస్తున్నా.. ఇంతలో నీ అరుపులు'' అంది.

''జుట్టు విరబోసుకొని.. అర్ధరాత్రి కిటికీలో నుంచి చూస్తుంటే భయమేసింది'' అన్నాడు విశాల్.

''మేం పట్టణం వాళ్లం కదా.. మేం దయ్యాలను నమ్మం '' అని వెక్కిరించింది మానస.

''సర్లే కాని.. భోజనానికి పద..'' అన్నాడు విశాల్.

***

వాన కురిసి ఆగిపోయింది. ఆకాశం మాత్రం నల్లగా ఉంది. గాలి స్తంభించి పోయింది.

''కారు ఇప్పుడే ఇబ్బంది పెట్టాలా..'' అని విసుక్కున్నాడు విశాల్.

''అదృష్టమని ఆనందపడు.. ట్రాఫిక్ ఎక్కువుంటే గత్తర గత్తరయ్యేది..''అంది మానస. పంజాగుట్ట శ్మశానం ముందు కారు ఆగిపోయింది. ''నువ్వు కారులో ఉండు.. నేను వెళ్లి మెకానిక్‌ను తీసుకువస్తా'' అని ఒక ఆటోను ఆపి ఎక్కాడు విశాల్. చిన్న చిన్న చినుకులు పడటం మొదలు పెట్టాయి. దూరంగా ఆకాశం ఉరుముతోంది. మెకానిక్‌ను తీసుకొని తిరిగొచ్చాడు విశాల్. కారు తలుపు తీసి ఉంది. కారులో మానస లేదు.. ''నువ్వు బాగుచేయి..'' అని మెకానిక్‌తో చెప్పి- మానస ఎక్కడికెళ్లిందా అని చూడటం మొదలు పెట్టాడు విశాల్.

'ఒక పక్క చినుకులు పడుతుంటే- కారు డోర్ తీసేసి ఎందుకు వెళ్లిపోయింది?' అనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. ఎక్కడా కనిపించలేదు. విశాల్ మనసులో ఏదో తెలియని భయం. ఏం చేయాలో కూడా తెలియటం లేదు. కొద్దిగా ముందుకు వెళ్లాడు. శ్మశానం స్పష్టంగా కనిపిస్తోంది. ''మను.. ''అని పిలుద్దామనుకున్నాడు. పిలిస్తే బావుండదని మనస్సులో ఎక్కడో సంకోచం. మెకానిక్ ''చిన్న ప్రోబ్లమే సార్..''అంటూ కారు ముందుకు వెళ్లాడు. విశాల్ జేబులో నుంచి సెల్‌ఫోన్ తీశాడు. మానస నెంబర్‌కు ఫోన్ చేశాడు. ఎంగేజ్ వస్తోంది. మాట్లాడుతూ ముందుకు వెళ్లిందేమో అనుకున్నాడు. మళ్లీ ఫోన్ చేశాడు. ఇంకా ఎంగేజ్ వస్తోంది.

ఇంతలో పెద్దగా చావు డప్పుల చప్పుళ్లు. శ్మశానానికి ఎవరిదో శవాన్ని తీసుకువచ్చారు. పాడె ముందు కొందరు పూలు జల్లుతున్నారు. వెనక కొందరు గట్టిగా ఏడుస్తున్నారు. చేతిలో కుండతో ఒక వ్యక్తి. మొత్తం దృశ్యమంతా సినిమాలో చూస్తున్నట్లు ఉంది. మానస నెంబర్‌ను మరింత గట్టిగా ఒత్తాడు. ఇంకా ఎంగేజ్ వస్తోంది. సాధారణంగా రెండు సార్లు చేసిన వెంటనే మానస తిరిగి కాల్ చేస్తోంది. ఇంత సేపు మాట్లాడదు. ఒక పక్క చప్పుళ్లు. మానస ఫోన్ తీయటం లేదనే అసహనం. విశాల్ పరిస్థితి చిత్రంగా మారిపోయింది. ఏం చేయాలో తెలియటం లేదు. ''కారు స్టార్ట్ అయింది సార్.'' మెకానిక్ వచ్చి చెప్పాడు. ''ఓకే.. కాని మేడమ్ ఎక్కడికి వెళ్లిందో తెలియటం లేదు..'' అసంల్పితంగా అన్నాడు విశాల్. ''ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటారు సార్!'' అన్నాడు మెకానిక్.

తల పక్కకు తిప్పిన విశాల్ నోటంట మాట రాలేదు..

***

దూరంగా శ్మశానంలో ఒక చెట్టు. ఆ చెట్టు కొమ్మలను అందుకోవాలని మానస పైకి ఎగురుతోంది. సన్నగా కురుస్తున్న వాన. నల్లటి ఆకాశం. బురద బురదగా ఉన్న శ్మశానం. దానిలో ఎర్రటి డ్రస్సు వేసుకున్న మానస కొమ్మను పట్టుకోవటానికి పైకి ఎగురుతోంది. రోడ్డు మీద నుంచి చూస్తే ఆ దృశ్యం చాలా విచిత్రంగా కనిపిస్తోంది. ఒక వైపు చావు డప్పులు.. మరో వైపు పైకి ఎగురుతున్న మానస..పరిగెడుతున్నంత వేగంగా శ్మశానంలోకి వెళ్లాడు విశాల్. మెకానిక్ ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ''మానస..'' అని వగరుస్తూ పిలిచాడు విశాల్. ''కారు బాగుపడిందా..మెకానిక్ వచ్చాడా.. నీ మిస్డ్ కాల్స్ ఉన్నాయి.. నేనే చేద్దామనుకుంటున్నా'' అంది మానస. ''పద..'' అని కారు వైపు నడవటం మొదలుపెట్టింది. రెండు నిమిషాల్లో ఇద్దరూ కారు దగ్గరకు వచ్చేశారు. మెకానిక్ మోహంలో ఇంకా ఆశ్చర్యం తగ్గలేదు. అతనికి డబ్బులు ఇచ్చి పంపేశాడు విశాల్.

''అసలు శ్మశానంలోకి ఎందుకు వెళ్లావు?..'' కోపంగా అడిగాడు విశాల్.

''ఆన్‌సైట్ నుంచి కాల్ చేశారు. కారు దిగి మాట్లాడుతూ.. తెలియకుండా లోపలికి వెళ్లిపోయా..'' అంది మానస.

''నీకో విషయం తెలుసా.. శ్మశానంలో ఉసిరి చెట్టు ఉంది. చింత చెట్టు ఉండాలి కాని'' అని చిత్రంగా నవ్వింది మానస.

''నువ్వు ఎక్కడికి వెళ్లిపోయావో తెలీదు..ఫోన్ చేస్తే ఎంగేజ్ వస్తోంది.. చూస్తే చెట్టు కింద ఎగురుతూ ఉన్నావు'' అన్నాడు విశాల్ కోపంగా. ''నువ్వు ఎందుకంత ఫీల్ అవుతున్నావో నాకర్థం కావటం లేదు. చెప్పానుగా.. ఫోన్ చేస్తే మాట్లాడుతూ వెళ్లానని.. ఇప్పుడు ఏమైంది?'' అని కొద్దిగా తీవ్రంగా అడిగింది మానస.

''ఇప్పుడు నాతో మాట్లాడకు. నిన్నటి నుంచి ఈ శ్మశానం గొడవ మనల్ని వదలటం లేదు'' అన్నాడు విశాల్.

కిటికీలోంచి ట్రాఫిక్‌ను చూస్తూ కూర్చుంది మానస. ఆ రోజు మొత్తమంతా ముభావంగానే గడిచింది. విశాల్ రోజంతా అన్యమనస్కంగానే ఉన్నాడు. మానస బాగానే ఉంది కాని.. విశాల్ ఇబ్బంది పడ్డాడు అనే విషయం మనసు మూలల్లో ఎక్కడో గుచ్చుతూనే ఉంది. సాయంత్రం ప్రతి రోజు కన్నా ముందుగానే బయలుదేరారు. దార్లో కూరలు కొన్నారు. సందు మొదట్లోకి వెళ్లేసరికి.. పెద్దగా బాజాల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. విశాల్‌కి ఉదయం జరిగిందంతా గుర్తుకొచ్చింది. ఏదో తెలియని అలజడి. మానస ఆసక్తిగా చూస్తోంది. మానస మోహంలోకి చూశాడు విశాల్. సాయంత్రం వీధి లైట్ల వెలుతురు ఆమె మొహం మీద పడుతోంది.. జరిగిపోతోంది.. కాని మానస కళ్లల్లో ఏదో విచిత్రమైన కాంతి. ఇంటి ముందు కారు ఆపాడు విశాల్. అప్పుడే ఒక గుంపు ఇంటి ముందు నుంచి వెళ్లిపోతోంది. ''వీళ్లందరూ ఎవరూ..'' అంటూ చిరాకుపడ్డాడు విశాల్. ''మనింటి ముందు వేప చెట్టుకు ఈ రోజు పెళ్లి చేశారు..'' అని గుమ్మంలోకి అడుగుపెట్టకుండానే ఇంటి యజమానురాలు చెప్పింది. ''వేప చెట్టుకు పెళ్లా.. భలే బావుంది.. నేనెప్పుడూ వినలేదు'' చాలా ఆసక్తిగా అంది మానస. విశాల్ ఏం మాట్లాడలేదు. మౌనంగా మెట్లు ఎక్కేశాడు. వెనకే మానస కూడా మెట్లు ఎక్కింది. ఆ రాత్రి వారిద్దరి మధ్య ఏదో తెలియని ఇబ్బంది నెలకొంది. ఇద్దరికీ నిద్ర రాలేదు. అలాగని మాట్లాడుకోలేదు. మౌనంగానే ఉన్నారు.

***

ఆ ఉదయం కూడా మబ్బు మబ్బుగానే ఉంది. రాత్రి సరిగ్గా నిద్ర లేకపోవటంతో విశాల్, మానసలకు బాగా అలసిపోయినట్లు అనిపిస్తోంది. ''నీతో మాట్లాడాలి..'' అన్నాడు విశాల్ కాఫీ ఇవ్వటానికి వచ్చిన మానసతో. ''చెప్పు..''అంది.

''నువ్వు శ్మశానం గురించి అంతగా ఆలోచించటమనేది నాకెందుకో ఇబ్బందిగా ఉంది'' అన్నాడు. మానస మొహం ఎర్రబడింది. ''చూడు విశాల్.. నేను శ్మశానం గురించి ఆలోచించటం లేదు. అనుకోకుండా కొన్ని సంఘటనలు జరిగాయి. వాటి గురించి నీకు ఎందుకు ఇబ్బంది వస్తోందో అర్థం కావటం లేదు. నేను శ్మశానంలోకి వెళ్లి ఉండకూడదు. నిజమే.. కాని అనుకోకుండా వెళ్లిపోయా. ఆ విషయాన్ని ఎందుకంత పెద్దది చేస్తున్నావో అర్థం కావటం లేదు..'' అంది మానస.

''అరే..నేను చెప్పింది నీకు అర్థం కావటం లేదు. మొన్నటి నుంచి జరుగుతున్న సంఘటనలన్నీ చాలా విచిత్రంగా ఉంటున్నాయి. ఒక దానికి మరొక దానికి సంబంధం ఉండకపోవచ్చు. కాని కలిపి చూస్తే- వాటన్నింటి వెనక ఏదో ఉందనిపిస్తోంది'' అన్నాడు విశాల్.

మానసకు ఇక విశాల్‌తో వాదించి ఉపయోగం లేదని అర్థమయింది. ''నువ్వు ఆఫీసులో ఎక్కువ స్ట్రెస్ ఫీల్ అవుతున్నావు. అందుకే అలా అనిపిస్తోంది... ఆఫీసుకు టైం అవుతోంది.. మళ్లీ



## ఇప్పట్లో రాను

'మురారి' చిత్రం తర్వాత ఆ మధ్య తెలుగు చిత్ర రంగంలో సొనాలి బెంద్రే ఓ వెలుగు వెలిగింది. తెలుగులో ప్రముఖ హీరోలందరి సరసనా నటించింది. ప్రస్తుతం పెళ్లి చేసుకుని ఇల్లు చక్కబెట్టుకోవడంలో నిమగ్నమైంది. దర్శక నిర్మాత గోల్డీ బెహల్‌ను వివాహం చేసుకున్న సొనాలి ఈ మధ్యనే తల్లి కూడా అయింది. పెళ్లికి ముందు 2003లో షారుక్ ఖాన్ హిట్ చిత్రం 'కల్ హో నహో'లో అతిథి పాత్ర పోషించింది. అదే ఆమె చివరి చిత్రం. తెరపై పునః ప్రవేశం ఎప్పుడు అని అడిగితే, ''నేనింకా సినిమాలకు సిద్ధంగా లేను. సినిమాలంటే పెద్ద కమిట్‌మెంట్. ప్రస్తుతం కాస్త ఖాళీ కావాలి. ఇప్పుడు సంసారమే గాని, సినిమాల సంగతి చూసేంత తీరిక లేదు,'' అంటోంది. సినిమాల్ని కాదన్నా బుల్లితెరకు సుముఖంగానే ఉంది. ప్రస్తుతం 'ఇండియన్ ఐడోల్' నాలుగో సీజన్‌లో జడ్జిగా పాల్గొనబోతోంది. అలాగే అభిషేక్ బచ్చన్‌తో కలిసి ఒమేగా వాచీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది.

మాట్లాడుకుందాం'' అంది మానస. ఆఫీసుకు బయలుదేరారు. మెట్లు దిగగానే పసుపు, కుంకుమలు పెట్టిన వేపచెట్టు కనిపించింది. మానస ఏదో అనబోయి మాటను మధ్యలోనే ఆపేసింది. కారులో కూడా ఇద్దరూ పెద్దగా మాట్లాడుకోలేదు. పంజాగుట్ట దగ్గరకు రాగానే ఇద్దరిలోను ఏదో తెలియని టెన్షన్. శ్మశానం దగ్గరకు రాగానే మానస అసంకల్పితంగా కిటికీ వైపు తల తిప్పింది. విశాల్ ఆమె మోహాన్ని నిశితంగా చూస్తున్నాడు. మానస మోహంలో సన్నటి నవ్వు రేఖ కదలాడింది. విశాల్ ఇంకా చూస్తూనే ఉన్నాడు. హఠాత్తుగా తల తిప్పింది. ''అబ్బా..'' అని గట్టిగా అరిచింది. విశాల్ కారు బ్రేక్ వేశాడు. కీచుమంటూ కారు ఆగింది. అప్పటి దాకా స్తబ్దుగాఉన్న వాతావరణంలో కదిలిక వచ్చింది. సన్నగా చినుకులు పడటం మొదలుపెట్టాయి. దూరంగా ఎక్కడో ఒక తీతువు పిట్ట అరుచుకుంటూ వెళ్లిపోతోంది.

***

''మెడ పట్టేసింది..'' అంది మానస. ''అంత గట్టిగా అరిచేసరికి దడుసుకున్నా..'' అన్నాడు విశాల్. వాన నెమ్మదిగా పెరుగుతోంది. అప్పటి దాకా కారులో ఉన్న ఇబ్బందికరమైన వాతావరణం మాత్రం తేలికపడింది. విశాల్, మానసలు తమ ప్రాజెక్టుల గురించి మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. ఆఫీసుకు వెళ్లిన తర్వాత పనుల్లో పడిపోయారు. మధ్యాహ్నం కలిసి భోజనం చేయటానికి కూడా టైమ్ లేదు. సాయంత్రం అవుతుండగా.. ఇద్దరికి ఖాళీ అయింది. విశాల్ ఇంటర్నెట్ బ్రౌజ్ చేయటం మొదలుపెట్టాడు. ఇంతలో ఫోన్ మోగింది. ''విశాల్.. నీకో విషయం చెప్పనా.. నెట్ బ్రౌజ్ చేస్తున్నా.. అందులో పంజాగుట్ట సెమిట్రి అని కొడితే.. కొన్ని వేల సైట్స్ వస్తున్నాయి..'' అని ఇంకా ఏదో చెప్పబోతోంది. ''మళ్లీ అక్కడికే వచ్చావు.. అసలు శ్మశానం వివరాలు నీకెందుకు? నువ్వెందుకు వెతుకుతున్నావు?''అని ఫోన్‌లో గట్టిగా అరిచాడు విశాల్. ''ఏమైంది నీకు.. ఎందుకలా అరుస్తున్నావు?'' అంది మానస. ''నిన్ను ఆ శ్మశానం ఒక పీడలా పట్టింది. మొన్నటి నుంచి చూస్తున్నా.. రోజులో సగం ఆ మాటలే..'' అన్నాడు విశాల్. ''నువ్వు పనిలో ఉంటే.. ఆ టెన్షన్ నా మీద ఎందుకు చూపిస్తావు.. నేను తర్వాత మాట్లాడతా'' అని ఫోన్ పెట్టేసింది మానస. విశాల్ మనస్సు పొరల్లో అనవసరంగా మానసను మాటలు అంటున్నానా అనే ఇబ్బంది. అన్యమనస్కంగా ఎదురుగా ఉన్న లాప్‌టాప్ స్క్రీన్ వైపు చూస్తూ ఉండిపోయాడు విశాల్. గూగుల్ సెర్చ్‌లో ''పంజాగుట్ట సిమెట్రీ'' అనే పదాలకు కొన్ని వేల సమాధానాలు కనిపిస్తున్నాయి.

***

సాయంత్రం మళ్లీ వాన వెలిసింది. విశాల్, మానసలు ఏం జరగనట్లు ప్రవర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. ''ఐమ్యాక్స్‌లో సినిమాకి వెళ్దామా..'' అడిగాడు విశాల్. ''సరే.. ఇంటికి వెళ్లి ఏం చేస్తాం.. సినిమాకే వెళ్దాం'' అంది మానస. సినిమా నుంచి బయటకు వచ్చే సరికి వాన తగ్గిపోయింది. వాతావరణం చల్లగా ఉంది. ఇంటికి వెళ్లి వంట వండుకు తిన్నారు. విశాల్ అప్పటికే చాలా అలసిపోయి ఉండటంతో పడుకున్నాడు. మానస ఆన్‌సైట్ కాల్ మాట్లాడుతోంది. ఒక గంట అయిన తర్వాత వచ్చి పడుకుంది. అర్ధరాత్రి.. గాఢంగా నిద్రపోతున్న విశాల్‌కు హఠాత్తుగా మెలుకువ వచ్చింది. పక్కకు తిరిగి చూశాడు. మానస పడుకుంది. కాని ఆమె కళ్లు సగం తెరుచుకొని ఉన్నాయి. లోపల కనుగుడ్లు గిరిగిర తిరుగుతున్నాయి. ఉన్నట్టుండి మానస పక్కకు తిరిగింది. నల్లగా ఉండే ఆమె జట్టు ఎర్రగా మారిపోతోంది. ఆకాశంలో నక్షత్రాలు మాదిరిగా.. ఆమె జట్టులో చిన్న చిన్న మినుగురు పురుగుల లాంటివి మెరుస్తున్నాయి. విశాల్‌కు గొంతు పూడుకుపోయింది. మాట రావటం లేదు. ఇంతలో టప్ మని శబ్దం. అప్పటి దాకా కాంతిని ఇచ్చిన బెడ్‌లైట్ పగిలిపోయింది. అంతా చీకటి. విశాల్ పక్క మీద నుంచి లేవటానికి ప్రయత్నిస్తున్నాడు. కాని కాళ్లు కదలటం లేదు..

***

''ఏమైంది?.. వంట్లో బావులేదా? ''- కంగారుగా లేచికూర్చుని అడిగింది మానస. ''నువ్వు.. నువ్వు..''అన్నాడు విశాల్. '' ఏమైంది నీకు.. ఏదైనా పీడకల వచ్చిందా? '' అంది మానస. ''నీ కళ్లు రౌండ్..రౌండ్‌గా తిరుగుతున్నాయి.. జట్టు అంతా ఎర్రగా మారిపోతోంది.. బల్బులు పేలిపోతున్నాయి'' అన్నాడు విశాల్. లేచి లైటు వేసింది మానస. ''కలలోనా..'' విశాల్‌ను అడిగింది మానస. ''కలలో కాదు.. నా కళ్లతో చూసా.. నీ కంటి పాపలు గుండ్రంగా తిరుగుతున్నాయి..జట్టు ఎర్రబడిపోయింది..'' అని మళ్లీ చెప్పాడు విశాల్. ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు. ''విశాల్.. నువ్వు అన్నీ ఊహించుకుంటున్నావు. ఎందుకలా ఫీల్ అవుతున్నావో అర్థం కావటం లేదు. జట్టుకు బెర్గండి కలర్ వేయించుకున్నా.. ఇది ఫ్యాషన్.. అది నీకు లైట్‌లో ఎర్రగా కనబడి ఉంటుంది.. అంతే.. నీకు ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు..మంచి నీళ్లు తాగి పడకో.. రేపు పొద్దున్న మాట్లాడుకుందాం'' అంది మానస. ఆ రోజు కూడా వాళ్లిద్దరికి నిద్ర లేదు. ఏదో తెలియని ఇబ్బంది.

***

ఉదయం లేచిన వెంటనే- ''విశాల్ నీతో మాట్లాడాలి..'' అంది మానస. ''చెప్పు.. '' అన్నాడు విశాల్. ''నాకు దెయ్యం పట్టిందని ఎందుకనుకుంటున్నావో నాకు తెలియదు..''. ''నేనా మాట అన్నానా..''అన్నాడు విశాల్. ''మనం నిజాలు మాట్లాడుకుందాం. నీకు ఎందుకో అలా అనిపిస్తోంది. కాని కారణం మాత్రం చెప్పటం

# నేను కాదు, ఆయనే కింగ్!



అక్షయ్ కుమార్ కొత్త చిత్రం 'సింగ్ ఈజ్ కింగ్' ఇటీవలే విడుదలై భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ప్రస్తుతం అతనే బాలీవుడ్‌లో కింగ్ అని సూచించడానికే సినిమాకు ఈ టైటిల్ పెట్టారన్న వాదన వినిపిస్తోంది. అందులో నిజం లేకపోలేదు. నిజానికి 'కింగ్ ఖాన్'గా అందరూ పొగిడే షారుక్ ఖాన్ సినిమాలతో పోలిస్తే గత ఐదు సంవత్సరాల్లో అక్షయ్ కుమార్ సినిమాలే ఎక్కువ కలెక్షన్లు వసూలు చేసాయి. అతని ఇటీవలి చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 500 కోట్లు వసూలు చేసి సంచలనం సృష్టించాయి. షారుక్ ఖాన్ గత చిత్రం 'ఓం శాంతి ఓం' తొలి వారంలో 37 కోట్లు వసూలు చేసి రికార్డు సృష్టిస్తే, ఇప్పుడు అక్షయ్ 'సింగ్ ఈజ్ కింగ్' ఏకంగా 45 కోట్లు వసూలు చేసి ఆ రికార్డును బద్దలు కొట్టింది. ఈ లెక్కలే 'సింగ్ ఈజ్ కింగ్'కు ఆ టైటిల్ పెట్టడానికి కారణమయ్యాయని బాలీవుడ్ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే అక్షయ్ మాత్రం వీటన్నింటినీ కొట్టి పారేస్తున్నాడు. అతని దృష్టిలో తను కాదు కింగ్, షారుక్ కూడా కాదు కింగ్. ''అమితాబ్ బచ్చన్ ముప్ఫైఅయిదేళ్ళు పైబడి ఈ రంగంలో ఉన్నారు. ఆయనే నా దృష్టిలో నిజమైన కింగ్. చాలా మంది కేవలం పది పదిహేనేళ్ళ నుండీ రంగంలో ఉండి తామే కింగ్‌లమని చెప్పుకుంటున్నారు. కాని బాలీవుడ్‌లో కింగ్ అంటూ ఉంటే అది అమితాబ్ మాత్రమే'' అంటూ తన అభిప్రాయాన్ని చెప్పాడు. అయితే పేరు చెప్పకుండానే ఇలా ''చాలా మంది'' అంటూ అక్షయ్ షారుక్‌ని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేసాడని మళ్ళీ గుసగుసలు మొదలయ్యాయి. దీనిపై స్పందిస్తూ, ''నేనేం అనుకుంటున్నానో అది చెప్పాను. ఇవో పెద్ద వివాదానికి కారణమవుతాయా, కానివ్వండి. నాకేం లెక్కలేదు,'' అంటున్నాడు. ఇన్నాళ్ళూ బాలీవుడ్‌లో ఖాన్-ఖాన్‌ల యుద్ధం మాత్రమే చూశాం. ఇకపై ఖాన్-కుమార్‌ల యుద్ధం చూడబోతున్నామన్నమాట.

లేదు. ఒక వేళ నా ప్రవర్తనలో మార్పు ఉంటే మార్చుకుంటా..'' అంది మానస. ''నీ ప్రవర్తనలో మార్పు లేదు. కాని మూడు రోజుల నుంచి ఎందుకో అన్ని విచిత్రంగా జరుగుతున్నాయి. కారణం చెప్పలేను కాని.. నువ్వు విచిత్రంగా ప్రవర్తిస్తున్నావు'' అన్నాడు విశాల్. ''నా ప్రవర్తనలో మార్పు లేదు. కాని నీ ఆలోచనల్లో మార్పు వచ్చింది.. ఎందుకో నాకు అర్థం కావటం లేదు.. శ్మశానం అనే పదం అన్నందుకే నాకు దెయ్యం పడితే.. ప్రతి రోజు దాని ముందు నుంచి వేల మంది వెళ్తారు. వాళ్ల పరిస్థితేమిటి? వాళ్లకు దెయ్యాలు పడతాయా..'' అని స్వరం పెంచింది మానస. విశాల్‌కు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఒక్క క్షణం ఊరుకున్నాడు. ''సరే.. ఇకమీదట నేను ఈ విషయాలు మాట్లాడను. నువ్వు పట్టించుకోవద్దు'' అని రాజీకి వచ్చాడు విశాల్. ''నాకు ఏం లేదు అంటే నువ్వు వినటం లేదు. మళ్లీ ఆ విషయం మాట్లాడనంటున్నావు. అంటే నువ్వు నాకు ఏదో ఉన్నట్టు నమ్ముతున్నట్టే కదా.. సరే.. ఇంక ఆఫీసు టైమ్ అవుతోంది.. వెళ్లాలి పద..'' అని లేచింది మానస.

***

ఆఫీసుకు వెళ్లి ల్యాప్‌టాప్ ఆన్‌చేసేసరికి చాలా మెయిల్స్ కనిపించాయి విశాల్‌కి. ఒకో దానికి సమాధానం ఇస్తూ పోతున్నాడు. ఒక మెయిల్ సబ్జెక్ట్‌లైన్– ''ఆవాహన'' అని కనిపించింది. డిలిట్ చేసేద్దామనుకుని ఏముందో చూద్దామని ఓపెన్ చేశాడు. మధ్యాహ్నం మూడింటికి దగ్గర్లో ఉన్న హోటల్‌లో లెక్చర్ ఉందని .. అందరూ రావచ్చని వచ్చిన ఆహ్వానం అది. ఒకసారి చదివి మళ్లీ పనిలో పడిపోయాడు విశాల్. మధ్యాహ్నం రెండు అయింది. భోజనం కూడా చేయలేదు. ఇంతలో పక్క క్యూబికెల్‌లో కూర్చునే మూర్తి వచ్చాడు. ''బాస్.. ఆవాహనకు వస్తున్నావా?'' అని అడిగాడు. ''నాకు ఇంట్రెస్ట్ లేదు.. అయినా అక్కడ మనకు తెలియనది ఏం చెబుతారు?'' అన్నాడు విశాల్. ''ఏం చెప్పినా.. చెప్పకపోయినా.. మన ఎండీ కూడా వస్తాడుట.. వెళితే ఒక కామన్ ప్లాట్‌ఫాం ఏర్పడుతుందిగా'' అన్నాడు మూర్తి. ''ఎంత సేపు..'' అడిగాడు విశాల్. ''గంటన్నర.. ఐదింటికి మళ్లీ వచ్చేద్దాం.. మానస కూడా వస్తుందా''అడిగాడు మూర్తి. ''రాదేమో! వర్క్ ఉందంది.. మనం వెళ్దాం పద'' అని బయలు దేరాడు విశాల్. హోటల్‌కు వెళ్లేసరికి దాదాపు మూడు అవుతోంది. రూమ్ అంతా నిండిపోయింది. ''ఎండీ ఎక్కడున్నాడో.. కనిపించటం లేదు..'' గుసగుసలాడాడు మూర్తి. ''కనిపిస్తాడు ..కంగారుపడకు'' కసురుకున్నాడు విశాల్. ఇద్దరూ ఒక మూల కూర్చున్నారు. మూడు అవగానే.. స్టేజి మీదకు తెల్లటి బట్టలు కట్టుకున్న ఒక వ్యక్తి వచ్చాడు. తనను తాను పరిచయం చేసుకున్నాడు. ప్రసంగించటం మొదలుపెట్టాడు. ''ఆవాహన అనేది ఎవరో కేవలం మంత్రగాళ్లో.. లేకపోతే సాధకులు మాత్రమే చేస్తారనుకుంటే తప్పు. మనం కూడా కొన్ని విషయాల గురించి తెలియకుండానే ఎక్కువ ఆలోచిస్తుంటాం. వాటికి కారణాలు వెతకటానికి ప్రయత్నిస్తాం. కారణాలు తెలియక పోతే– ఏ అతీంద్రియ శక్తులకో వాటిని ఆపాదిస్తాం. తెలిస్తే దానిని సిద్ధాంతీకరిస్తాం. ఇది సాధారణంగా ఎదుట వ్యక్తులకు సంబంధించిన అంశాలనే చేస్తాం. దీనికి కారణం ఎదుటి వ్యక్తులపై నమ్మకం లేకపోవటం.. మనస్సులో ఏ మూలో ఉండే అనుమానం..'' ఇలా సాగిపోతోంది. విశాల్ ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. మానస గురించి తప్పుగా ఆలోచించానా? ప్రతి విషయాన్ని భూతద్దంలో చూస్తున్నానా? అనే భావాలు అతనిలో సంఘర్షణను రేపుతున్నాయి. ప్రసంగం పూర్తయ్యే సరికి విశాల్‌కు ఉన్న అనుమానాలన్నీ పటాపంచలయి పోయాయి. తేలికపడ్డ మనస్సుతో ఆఫీసుకు బయలుదేరాడు. ఇంతలో సెల్‌ఫోన్ మోగింది. మానస కాల్. ''నీకో విషయం చెప్పాలి.. నేనో స్పీచ్‌కి వెళ్లా.. నా అనుమానాలన్నీ పోయాయి..'' ఫోన్ ఎత్తిన వెంటనే మాట్లాడటం మొదలుపెట్టాడు విశాల్. ''అన్నీ ఇంటికి వెళ్లిన తర్వాత మాట్లాడు కుందాం. అందరూ సెంట్రల్‌కు వెళ్తున్నారు. నేను వెళ్తా. ఇంటికి నువ్వు వెళ్లిపో'' అని ఫోన్ పెట్టేసింది మానస.

***

ఎలాగ మానస ఇంటికి లేటుగా వస్తుంది కాబట్టి ఆఫీసులో పని పూర్తి చేసుకు బయలు దేరాడు విశాల్. ఇంటికి వచ్చే సరికి చీకటి పడిపోయింది. కొన్ని లైట్లు వెలుగుతున్నాయి.. కొన్ని వెలగటం లేదు.. ''కొన్ని ఫేజ్‌లు పోయినట్లున్నాయి..'' అనుకుంటూ మెట్లు ఎక్కడం మొదలెట్టాడు. ''వేప చెట్టు ఎందుకో ఎండిపోతోందండి.. వాన కాలం పచ్చగా ఉండాల్సిన చెట్టు..'' ఎవరికో చెబుతోంది ఇంటావిడ. తనలో తాను నవ్వుకున్నాడు విశాల్. పైకి వెళ్లే సరికి ఇంటి తలుపులు తీసున్నాయి. ''అరే.. మానస అప్పుడే వచ్చేసిందా..'' అనుకున్నాడు విశాల్. తలుపు తోసుకొని లోపలికి వెళ్లాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. లైట్లు కూడా లేవు. ''మానస..'' పిలిచాడు విశాల్. సమాధానం లేదు. హాల్‌లో లైట్ వేశాడు. ''మానస..'' అని పిలుస్తూ వంటింట్లోకి వెళ్లాడు విశాల్. కిటికీ దగ్గర ఉంది మానస. వీధిలో లైటు ఆమె మోహంపై సన్నగా పడుతోంది. ఒక్క సెకను ఆగాడు విశాల్. గాలి పీల్చుకున్నాడు. ''మానస..'' అని పిలిచాడు. మానస నెమ్మదిగా తల తప్పింది. విశాల్ వైపు చూసింది. విచిత్రంగా నవ్వింది..

*

## డ్రీమ్ గర్ల్ హేమమాలినికి షెర్లిన్ షాక్

ఆ మధ్య విడుదలై విజయం పొందిన 'ఏ ఫిలిం బై అరవింద్' చిత్రం గుర్తుందా. ఆ సినిమాలో మోనాగా పేరు మార్చుకుని నటించిన షెర్లిన్ చోప్రా తరువాత మన పొరిగింటి పుల్లకూర నచ్చక తన సొంత గూడు బాలీవుడ్‌కే పయనమయ్యింది. అక్కడ రెండు మూడు మల్లికా షెరావత్ 'మర్డర్' లాంటి సినిమాల్లో వళ్ళు దాచుకోకుండా నటించినా పెద్దగా ఫలితం లేకపోవడంతో ఇప్పుడు మ్యూజిక్ వీడియోలవైపు చూపుతిప్పింది. అలనాటి డ్రీమ్ గర్ల్ హేమా మాలిని 'దస్ నంబరీ' అనే చిత్రంలో నర్తించి మెప్పించిన ఓ పాటను ఇప్పుడు రీ-మిక్స్ చేసి, వీడియోలో తానే నర్తించి విడుదల చేసింది. 'దర్ద్-యె-షెర్లిన్' అన్న ఆ వీడియో చూసిన హేమా మాలిని నోరెళ్ళబెట్టిందట. ఆ వీడియోలో షెర్లిన్ బట్టలు చాలా పొదుపుగా వాడింది మరి! తన క్లాసిక్ పాటకు ఇప్పుడు షెర్లిన్ ఇంచుమించు





నగ్నంగా నర్తించడం హేమా మాలినికి మింగుడు పడటం లేదు. ''మైగాడ్! ఆమె నన్నీ పచ్చి-పచ్చి శృంగారంతో ఎందుకు కలుపుతుందో అర్థం కావడం లేదు. బహుశా ఈ రకంగా తన ఇమేజ్‌ను పెంచుకోవాలనుకుంటోందేమో. పాపం! ఆ పిచ్చి పిల్ల ఇదంతా ఇమేజ్ కోసమే చేస్తూంటే తను కోరుకుంది జరగాలనే ఆశిస్తున్నాను. నగ్నత్వాన్ని చూడాలనుకునే వాళ్ళందరికీ కూడా ఇది ఆనందమే. ఏది ఏమైనా నా పేరు హేమా మాలిని, అది మాత్రం మారదు కదా!'' అంటూ వెటకారంగా తన అక్కసు వెళ్ళగక్కింది. దీనికి షెర్లిన్ ప్రతిస్పందన ఇది: ''ఆమె దయ గల పలుకులకు ధన్యవాదాలు, కాని ఆమె పాతకాలం మనిషి. ఇప్పుడు నగ్నత్వం ఏమంత పెద్ద విషయం కాదు. అయినా ఇందులో తప్పేం ఉంది.''